క్లుప్తంగా

బాలికల హక్కులపై అవగాహన



బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో బాలికలు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి జిల్లా డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ బాలికల హక్కుల గురించి వివరించారు. బాలల హక్కులకు భంగం కలగకుండా అందరూ బాధ్యత వహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని దుర్గాభవాని, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ బాలికలకు ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. విద్యార్థినులకు మంచి భవిష్యత్తు ఉందని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బాలికల హక్కులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా చైల్డ్ వెల్ఫేర్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ విభాగం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల్లో కంటి సమస్యలపై దృష్టి సారించాలి



బాలుడి కంటిని పరీక్షిస్తున్న డాక్టర్ వీరేంద్ర

ఆరిలోవ: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా పిల్లల్లో వచ్చే కంటి కేన్సర్‌పై ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్వాతి, డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ మాట్లాడుతూ పిల్లల కంటి సమస్యలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. పిల్లల్లో రెటినో బ్లాస్టోమా కంటి కేన్సర్ అత్యంత ప్రమాదకరమన్నారు. దీనివల్ల పిల్లల దృష్టికి ప్రమాదం కలుగుతుందన్నారు. తెల్లని ప్రతిబింబం, మెల్లకన్ను, కంటి పరిమాణంలో వ్యత్యాసాలు, కనురెప్పల వాపు, కళ్లలో ఎరుపుదనం రావడం తదితర లక్షణాలు ప్రాథమికంగా కనిపిస్తాయని తెలిపారు. ఆయా లక్షణాలు ఉన్న పిల్లలను తల్లిదండ్రులు కంటి వైద్యులకు చూపించాలన్నారు. ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో దీనికి సంబంధించిన ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం పిల్లలకు కంటి వైద్య పరీక్షలు చేశారు.

9 నుంచి ఉచిత యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థూలకాయ నివారణకు ఈ శిబిరం 8 వారాల పాటు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 6–7 గంటల వరకు 7.15 నుంచి 8.15 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఆసక్తి గల వారు 91678 89881, 70970 99900 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నిర్మాణ రంగంలో ప్రతిభకు అవార్డులు



అవార్డు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: నిర్మాణ రంగంలో ప్రతిభ కనబర్చిన పలువురికి మోడుకో అవార్డులను ఆ సంస్థ అందజేసింది. బీచ్‌రోడ్డులోని ఒక హోటల్ పది మందికి అవార్డులను సంస్థ వ్యవస్థాపకుడు నైతిక్ లఖానీ అందజేశారు. అనంతరం సంప్రదాయక నిర్మాణం..భవిష్యత్తు సవాళ్లు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేష్ చంద్ర త్రిపాఠీ, డైరెక్టర్ ప్రజ్ఞా తదితరులు పాల్గొన్నారు.

విమ్స్‌లో చురుగ్గా నిర్మాణాలు



విమ్స్ ఆవరణలో నిర్మాణం చేపడుతున్న ఆయుష్ ఆస్పత్రి



విమ్స్‌లో ఆవరణలో సిద్ధమైన రీజనల్ డ్రగ్ స్టోర్స్, సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్

- రూపుదిద్దుకుంటున్న ఆయుష్ ఆస్పత్రి
- సిద్ధమవుతున్న డ్రగ్ స్టోర్

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో మరిన్ని వైద్య సేవలు కోసం నిర్మాణాలు జరుగుతున్నాయి. 2015 నుంచి పేదలకు వైద్య సేవలు అందుతున్నాయి. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి సుమారు 100 ఎకరాలు కేటాయించారు. దీనిలో సుమారు 20 ఎకరాల్లో ఆరు బ్లాకులతో భవనాలు, రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం వాటిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇందులో మిగిలిన స్థలంలో వైద్య విభాగానికి సంబంధించిన మరిన్ని కొత్త నిర్మాణాలు చేపట్టి సేవలు అందించడానికి వైద్యాధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సుమారు ఎకరా స్థలంలో రీజనల్ డ్రగ్ స్టోర్స్, సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్, ఆయుష్ ఆస్పత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. రీజనల్ డ్రగ్ స్టోర్స్, సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్మాణం కోసం విమ్స్ ఆవరణలో ఎకరా స్థలం కేటాయించారు. అందులో రూ.20 కోట్లతో నిర్మాణం చేపట్టారు. దీని నిర్మాణం దాదాపు పూర్తయింది. దీన్ని కొద్ది రోజుల్లో వినియోగంలోకి తీసుకురానున్నారు. ఇది అందుబాటులోకి వస్తే రోగులకు నామమాత్రపు ఫీజుతో వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు, సి.టి స్కాన్, ఎం.ఆర్.ఐ, ఎక్స్‌రేలు తీయడానికి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన వస్తోంది. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్న ఈ ల్యాబ్‌లు వల్ల రోగులకు చాలా వరకు వైద్య ఖర్చులు తగ్గనున్నాయి. దీంతో పాటు ఇక్కడ ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం కోసం మూడు ఎకరాల స్థలం కేటాయించారు. ఈ స్థలంలో నెల రోజులుగా నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ ఆస్పత్రి వినియోగంలోకి వస్తే రోగులకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

23వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణలు శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు నాయకుడు గుడ్ల సత్యారెడ్డిలతో కలిసి వారు వార్డులో మద్దిలపాలెం, చైతన్య నగర్ ప్రాంతాలలో రూ.48.50 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, ఎంపీలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభమైందని కార్పొరేటర్ గుడ్ల విజయసాయి తెలిపారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవలో ఇండోర్ స్టేడియం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఆరిలోవ కాలనీలో ఇండోర్ స్టేడియం కోసం కేటాయించిన స్థలంలో మ్యాప్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పెదగదిలి గెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: ఆరిలోవలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ 12, 13 వార్డుల్లోని పలు ప్రాంతాలను శనివారం ఆయన సందర్శించారు. పెదగదిలిలో గెడ్డపై వంతెన నిర్మాణ పనులు పరిశీలించి.. త్వరితగతిని పూర్తి చేయాలన్నారు. అనంతరం హెల్త్ సిటీ వెనుక ఉన్న క్రీడా మైదానాన్ని సందర్శించారు. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలించి.. విస్తీర్ణం గురించి ఆరా తీశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని, స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజును ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇక్కడ జీవీఎంసీకి చెందిన 2.8 ఎకరాల స్థలంలో అత్యాధునిక ఇండోర్ స్టేడియం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ స్థలం చుట్టూ ఉన్న చెట్లను తొలగించకుండా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తర్వాత హెల్త్ సిటీలో రోడ్లు పరిశీలించి.. ఇరుపక్కలా మొక్కలు నాటాలని సూచించారు. హెల్త్‌సిటీలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్‌ను ఆదేశించారు. జోన్–2 జెడ్సీ కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, ఏసీపీ శాస్త్రి, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి



19వ వార్డులో ఇంటింటికి సంక్షేమ పథకాలు వివర్శిస్తున్న ఎంపీ



20వ వార్డులో ప్రజలకు సంక్షేమపథకాలను వివరిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

- విశాఖ ఎంపీ, 'తూర్పు' సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 31వ రోజుకు పాదయాత్ర

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన 31వ రోజు పాదయాత్ర శనివారం 19వ వార్డులో కొనసాగింది. ఆయన పాదయాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. జాలరి ఎండాడ, పెదజాలరిపేట, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మీతో పాటు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులైన మహిళలు ఎంపీకి ఘనస్వాగతం పలికి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలన్నారు. ఈ దిశగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ పాదయాత్ర ద్వారా నెల రోజులగా ప్రతి ఇంటి కష్టం తెలుసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే తూర్పు నియోజవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే సీఎం ఆకాంక్ష

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం 20వ వార్డులో శివాజిపాలెం, డాక్టర్స్ కాలనీ, ప్రశాంతి నగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వారికి లభిస్తున్న సంక్షేమ పథకాలు, వారి సమస్యలు వంటివి అడిగి తెలుసుకున్నారు. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అభివృద్ధి చేస్తున్న విధానాన్ని వివరించా రు. నగరంలో రహదారులు, కూడళ్ల అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వార్డు అధ్యక్షుడు రవి కిరణ్ రెడ్డి, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలే లక్ష్యం

గురుకులాల జిల్లా కన్వీనర్ సత్యారావు



టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో అధ్యాపకులు

విశాఖ విద్య: గురుకులాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సత్కరిస్తున్నారు. సింహాచలం బీసీ సంక్షేమ గురుకులంలో శనివారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. గురుకులాల జిల్లా కన్వీనర్ దాసరి సత్యారావు హాజరైన విద్యార్థులను ఉత్తేజపరిచారు. పబ్లిక్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా చదివితే విజయం తథ్యమన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా చదువుకోవాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ఉన్న మూడు బీసీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున సబ్జెక్టు టీచర్లు తగిన శ్రద్ధ తీసుకొని విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులను, ఇందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత 'తూర్పు'



జట్టు సభ్యులు, జిల్లా క్రీడాధికారులతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్స్‌లో తూర్పు నియోజకవర్గానికి చెందిన 23వ వార్డు జట్టు విజేతగా నిలిచింది. ఏయూలోని గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా శనివారం తూర్పు 23వ వార్డు జట్టుకు గాజువాక నియోజకవర్గానికి చెందిన జట్టుకు ఫైనల్ మ్యాచ్ జరిగింది. ముఖ్య అతిథి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ టాస్ వేసి ఇరు జట్ల మధ్య పోటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభావంతులను అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పోటీల ద్వారా పెద్ద ఎత్తున క్రీడా ఆణిముత్యాలను గుర్తించి ప్రోత్సహిస్తామని చెప్పారు. ఎంపీతోపాటు జిల్లా క్రీడాధికారి జూన్ గాలియేట్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ఆదర్శంగా 23వ వార్డు



కార్పొరేటర్ విజయసాయిని అభినందిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ

మద్దిలపాలెం : స్వచ్ఛత ఎకో వైజాగ్‌లో 23వ వార్డు 8వ ర్యాంకును సాధించడం అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణలు స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయిని అభినందించారు. ఈసందర్భంగా మేయర్, ఎంపీలు మీదుగా కార్పొటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డిలకు జ్ఞాపికను అందించారు. ఆదర్శనీయమైన వార్డుగా తీర్చిదిద్దాలని వారు సూచించారు.

శానిటరీ సిబ్బందికి సత్కారం



శానిటరీ సెక్రటరీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న గేదెల నాగరాజు తదితరులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు శానిటరీ సిబ్బందిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు సత్కరించారు. ఎంవీపీ కాలనీలోని సెక్టార్–1 సచివాలయ ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. శుక్రవారం జీవీఎంసీ మేయర్ పారిశుధ్య నిర్వహణపై అవార్డులు ప్రకటించగా 17వ వార్డు నాలుగో స్థానంలో నిలిచింది. వార్డులో అనుసరిస్తున్న పారిశుధ్య విధానాలు, పరిశుభ్రతను బేరీజు వేసుకొని జీవీఎంసీ అధికార యంత్రాంగం 17వ వార్డుకు 4వ స్థానాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో 4వ స్థానం రావడంలో కీలకంగా వ్యవహరించిన పారిశుధ్య సిబ్బందిని నాగరాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పీలా ప్రేమ్ కిరణ్ , సచివాలయ శానిటరీ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వేంకటేశ్వర స్వామి కల్యాణం



భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీ సరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీ శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్ శర్మ దంపతులు వేదపండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్చరణ మధ్య శనివారం శ్రీ వేంకటేశ్వస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. దీంతో పాటు శ్రీ సరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం నుంచి శ్రీ సుదర్శన హవనం, హయగ్రీవ మాలామంత్ర హవనం, ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హవనం, చండీ సప్తశతీ హవనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విద్యార్థులు వీణానాదం, సంకీర్తనార్చన కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. శ్రీ శారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ విద్యార్థులకు శ్రీ సరస్వతీ దేవి కటాక్షం లభించడంతో పాటు విద్యాబుద్ధులు సిద్ధించాలనే లక్ష్యంతో ఏటా సంస్థ ఆధ్వర్యంలో ఈ యాగాలు చేస్తున్నట్లు సాయికాంత్ శర్మ తెలిపారు. నగర వాసులు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివారం కూడా మహోత్సవాలు కొనసాగనున్నాయి.

ఘనంగా ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవం



ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న త్రినాథమూర్తి

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూఎస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాథమూర్తి మాట్లాడుతూ భోదనతోపాటు విద్యార్థులను చిన్నతనం నుంచి క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన సంఘ ప్రతిజ్ఞ చేయించారు.

16 కిలోల గంజాయి పట్టివేత



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ నాగేంద్రుడు (స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ విశాఖ ఐ హాస్పిటల్ వద్ద శనివారం నలుగురు వ్యక్తులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.త్రినాథ్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద 16 కిలోల గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ద్వారకా పోలీసులకు అప్పగించారు. ద్వారకా సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ కె.మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో పోటీల రన్నర్‌కు అభినందన



న్యూ రేసపువానిపాలెం టీం సభ్యులను అభినందిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో జీవీఎంసీ 22వ వార్డు న్యూ రేసపువానిపాలెం టీం రన్నర్‌గా నిలిచింది. చిన్నవాల్తేరు ఏయూ గ్రాండ్స్‌లో శనివారం జరిగిన ఈ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన జట్టును పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ అభినందించారు.

పర్యావరణ హితమే ధ్యేయం



మాట్లాడుతున్న యూసీడీ పీవో లక్ష్మి

మురళీనగర్: ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించడమే ధ్యేయంగా మెలగాలని జీవీఎంసీ యూసీడీ ప్రొగ్రాం ఆఫీసర్ లక్ష్మి అన్నారు. మురళీనగర్ ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం మురళీనగర్ గార్డెనర్స్ ఆర్ట్ అండ్ మినియేచర్ ఎగ్జిబిషన్, ఇంటి దగ్గరే కూరగాయలు పండించుకునే విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినియేచర్ ప్రదర్శన ప్రతి ఒక్కరినీ ఆకర్షించేలా ఉందన్నారు. ప్రతి ఇంటా పచ్చదనం పెంపొందించే క్రమంలో మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. భారత కిసాన్ సంఘ్ జాతీయ నాయుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ రేపటి తరం స్వచ్ఛమైన వాతావరణంలో జీవించేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గుడ్డ సంచుల వాడకంపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఉదయభాస్కర్ వేసిన ఆర్ట్స్, ప్రొఫెషనల్ మినియేచర్ ఆర్టిస్ట్ జి.రమాదేవి ఏర్పాటు చేసిన మినియేచర్స్ ఆకట్టుకున్నాయి. మినియేచర్ ప్రదర్శనను విద్యార్థులు తిలకించారు.

నేడు వ్యాకులమాత మహోత్సవం

కంచరపాలెం: విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండడాబాలకు చెందిన వ్యాకులమాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 4న ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవం నిర్వహించనున్నారు. జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండడాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు. అంతకు ముందు ప్రధాన దేవాలయంలో వేర్వేరుగా చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం జరగనున్న ఈ పండగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పుణ్యక్షేత్రాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పీపీసీ అధ్యక్షుడు ఎస్. రాజేష్‌బాబు, జి. శ్యామలరావు, స్వర్ణలత పనులు పర్యవేక్షించారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర..

జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకలో భాగంగా వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ కొత్తరోడ్డు, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి, కొత్తవలస వరకు పాదయాత్ర చేపట్టారు. భక్తి గీతాలు ఆలపిస్తూ సందడిగా పాదయాత్ర చేశారు.